# మూడవ జనాంగం (జాతి)

# (2:11-18)

ఆస్ట్రేలియాలో స్కూలు బస్ నడిపిన జాన్ రీడ్ యొక్క కథను గూర్చి కెంట్ హూ తెలిపాడు. బస్ తెల్ల, నల్ల పిల్లలను తీసికొనిపోతుందట. ఆ బాలురు మానక రచ్చ చేస్తూ, దెబ్బలాడుకునేవారట. ఆ పిల్లల మధ్య జరిగే తగవులు వినగలిగినంత మట్టుకు జాన్ పోనిచ్చాడు. ఆ తరువాత రోడ్డుకు ప్రక్కనే బస్ నిలిపి, తెల్ల పిల్లలతో, "మీరు ఏ రంగువారు?" అని అడిగాడట.

"తెలుపు" (అని జవాబు వచ్చింది).

"లేదు, మీరు ఆకుపచ్చ. ఈ బస్సులో వెళ్లేవారందరు పచ్చనివారే. ఇప్పుడు మీరు ఏ రంగు" అని అడిగాడట.

దానికి తెల్ల పిల్లలు, "ఆకుపచ్చ" అని అన్నారట.

అప్పుడు ఆదిమవాసులతో జాన్ మాట్లాడి, "మీరు ఏ రంగు?" అని అడిగాడట.

"నలుపు" అని వారన్నారు.

"లేదు, మీరు ఆకుపచ్చ. ఈ బస్‌లో వెళ్లే పిల్లలందరు పచ్చనివారే. ఇప్పుడు మీరు ఏ రంగు? అని అడిగితే?"

"పచ్చని"వారమని అనాగరికులు అన్నారట.

దీనితో వారి రచ్చకు, తగవులకు – కొంతసేపు అంతం వచ్చిందట. రోడ్డుమీద కొన్ని మైళ్లు వెళ్లిన తరువాత, ఆ పిల్లలలో ఒకడు, "సరే, బస్‌లో ఈ వైపు లైట్ గ్రీన్, ఆ వైపు డార్క్ గ్రీన్" అని మొదలుపెట్టాడు. దానితో రచ్చ మరలా ఆరంభమయ్యింది.

తన పరిష్కారం ఎక్కువసేపు పనిచేయకపోయినా, వారి మధ్య ఏది అవసరమో బస్ నడిపే వ్యక్తికి తెలిసింది. ఆ బస్‌లోని పరిస్థితి ఒక క్రొత్త జాతికి పిలుపునిచ్చింది, తెల్లవారు లేరు, నల్లవారు లేరు – ఏ రంగు భేదం లేకుండ అందరు పచ్చనివారే కావాలి.[1] ప్రజలు పొందికగా లేక ఐకమత్యంగా నివసించాలంటే, ఏ భేదము చేయబడ కూడదు.

ఎఫెసీయులకు పౌలు వ్రాసిన పత్రిక ఒక నూతన జాతిని సృజించడాన్ని గూర్చి మాట్లాడుతుంది. ఈ నూతన జాతిని సృష్టించడానికి యేసు ఈ లోకానికి వచ్చినట్టు అది ప్రకటిస్తుంది.

ఎఫెసీయులకు పౌలు ఈ పత్రిక వ్రాసిన అనేక సంవత్సరాల తరువాత, రెండవ శతాబ్దపు క్రైస్తవుడైన అలెగ్జాండ్రియావాడైన క్లెమెంత్, తన రచనలలో ఒకదానియందు, ఈ నూతన జాతిని యిలా సూచించాడు: "నూతన విధానంలో దేవుని ఆరాధించే మనము,

మూడవ జాతిగా ఉన్నాం."[2]

క్రైస్తవులు మూడవ జాతి. మనము దేవుని నూతన సమాజము, దేవుని నూతన తెగయై ఉన్నాం.

> కాబట్టి మునుపు శరీరవిషయములో అన్యజనులైయుండి, శరీరమందు చేతితో చేయబడిన "సున్నతిగలవారు" అనబడినవారిచేత "సున్నతిలేనివారనబడిన" మీరు ఆ కాలమందు ఇశ్రాయేలుతో సహపౌరులుకాక, పరదేశులును, వాగ్దాన నిబంధనలు లేని పరజనులును, నిరీక్షణలేనివారును, లోకమందు దేవుడులేనివారునైయుండి, క్రీస్తుకు దూరస్థులైయుంటిరని మీరు జ్ఞాపకము చేసికొనుడి. అయినను మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తుయేసునందు క్రీస్తు రక్తమువలన సమీపస్థులై యున్నారు. ఆయన మన సమాధానమైయుండి మీకును మాకును ఉండిన ద్వేషమును, అనగా విధిరూపకమైన ఆజ్ఞలుగల ధర్మశాస్త్రమును, తన శరీరమందు కొట్టివేయుటచేత మధ్య గోడను పడగొట్టి, మన ఉభయులను ఏకముచేసెను. ఇట్లు సంధిచేయుచు, ఈ యిద్దరిని తనయందు ఒక్క నూతన పురుషునిగా సృష్టించి, తన సిలువవలన ఆ ద్వేషమును సంహరించి, దాని ద్వారా వీరిద్దరిని ఏక శరీరముగా చేసి, దేవునితో సమాధానపరచ వలెనని యీలాగు చేసెను గనుక ఆయనయే మనకు సమాధానకారకుడై యున్నాడు. మరియు ఆయన వచ్చి దూరస్థులైన మీకును సమీపస్థులైనవారికిని సమాధాన సువార్తను ప్రకటించెను. ఆయన ద్వారానే మనము ఉభయులము ఒక్క **ఆత్మ**యందు తండ్రి సన్నిధికి చేరగలిగియున్నాము (2:11-18).

ప్రాథమికంగా, ఈ లేఖన భాగం స్థాపించేదంతా ఒక ప్రతిపాదనలో మనం పట్టుకోగలిగితే, అది యిలా ఉండవచ్చు: వారు ఒక నూతన జాతి ప్రజలను సూచిస్తున్నట్టు క్రైస్తవులు గ్రహించాలని ప్రభువైన యేసు ఉద్దేశిస్తున్నాడు.

## మన గతాన్ని గుర్తు చేసికొనడంవలన నూతన జాతిని అభినందించడంలో మనం ఎదుగుదుము

మనలో ఎవరైనా ఈ నూతన జాతిని గూర్చి మాట్లాడదానికి ఎందుకు ప్రేరేపింప బడాలి? 11, 12 వచనాలలో జవాబు కన్పిస్తుంది. గత జీవితాన్ని జ్ఞాపకం చేసుకొనడం వలన నూతన జాతికొరకైన మన అభినందన వృద్ధి ఔతుంది. ఆ జీవితాన్ని – "దూరస్థులై యున్నారనే" ఒకే పదం వర్ణిస్తుంది. మన గత జీవితం దేవునినుండియు, యితర ప్రజలనుండియు దూరం చేసింది.

ఇది ఒకనికొరకు – అందరు, అందరికొరకు – ఒకడు అనే లోకం కాదు, కదా? ఈ లోకంలోని ప్రజలు ఒకరితో ఒకరు పొత్తు కలిగియుండరు. దేశాల మధ్య సంఘర్షణలు ఉంటాయి. పెద్ద పట్టణాలలో, క్రూర కార్యాలు చేసేవారి గుంపు ప్రాంతాలను పంచుకొని, తమ హద్దులు దాటి వచ్చేవారిని చంపుతూ ఉంటారు. మన యిండ్లలో కుటుంబపరమైన పోరాటాలు ఉంటాయి. పెరిగే విడాకుల సంఖ్య దీనికి రుజువుగా ఉంటుంది. సంఘంలో సయితం, గీతలు గీయబడిన కొంతమంది ప్రజలు తక్కినవారితో వేరు చేయబడతారు. దూరస్థులుగా ఉండడం మన లోకపు తీరైయుంది.

పౌలు ఈ సమస్యను గూర్చి మాట్లాడుతున్నాడు. ఒకరితో ఒకరు పొసగని స్థితిని క్రైస్తవ్యం తప్పించుకొని పోనియ్యదు. క్రైస్తవ్యం ఈ స్థితిని నేరుగా ఎదుర్కొనబోతున్నట్టు పౌలు చూచాడు. పౌలు దినాల్లోని లోకం, యూదులు, అన్యజనులనే రెండు గుంపులకు చెందిన ప్రజలు ఒకరికొకరు దూరస్థులైయున్నారు. యూదులు అన్యజనులను – "సున్నతిలేనివారనే" పరిహాసపు పేరుతో పిలిచేవారు. అది ఆ జాతినంతటిని అపహసించి, హేళన చేసే పేరైయుంది. దేవుడు అంతమంది అన్యజనులను ఎందుకు సృజించాడని – ఒక ప్రముఖ రబ్బీని అడిగినప్పుడు, అతని జవాబు: "గెహెన్నా (నరకం)లో చాలినంత వంట చెఱకు ఉండేలా"[3] అని ఉంటుంది.

ఆ రెండు గుంపుల మధ్య వైరుధ్యం ఎంత తీవ్రంగా ఉండేదంటే, బిడ్డను కనడంలో ఒక అన్య స్త్రీకి (యూదుడు) యూదురాలు సహాయం చేయడం చట్ట విరుద్ధమైయుంటుంది. అలా సహాయం చేయడంవలన మరొక అన్యజాతివానిని లోకంలోనికి తెచ్చే విషయంలో సహాయపడడమౌతుంది. ఒక యూదుడు అన్య స్త్రీని వివాహం చేసికొన్నట్టయితే, అది అతని మరణంగా ఎంచబడుతుంది, అంత్యక్రియలు చేయబడతాయి. యూదుల కుటుంబానికి నష్టం కలిగినట్టౌతుంది. యూదుడు పాలస్తీనాలో ప్రవేశించినప్పుడు, తన కాళ్ల దుమ్ము దులిపివేసికొంటాడు, ఎందుకంటే పరిశుద్ధ దేశం అన్యజనుల దుమ్ముతో కలుషితం కాకూడదని. అన్యజనులపట్ల యూదుల ద్వేషం అంత విపరీతంగా ఉండేది. అన్యజనులకు కూడా యూదులంటే అలాగే ఉండేది, వారు యూదులను నిర్లక్ష్యపెట్టేవారు.

అన్యజనులలోనుండి క్రైస్తవులైనవారికి పౌలు వ్రాశాడు. చిన్ననాటినుండి వారు యూదులచే తృణీకరింపబడిన వారైనట్టు వారే ఎరుగుదురు. పైగా వారు కూడా యూదులను ద్వేషించినవారే. అయితే క్రీస్తునందు వారు – యూదులు అన్యజనులు ఏకమైయున్న నూతన జాతిలో భాగమైయున్న సంగతిని తెలియజేయడానికి అన్యజనులలోనుండి క్రైస్తవులైనవారికి పౌలు ఈ పత్రికను పంపాడు. ఈ నూతన జాతిలో – జాతులకు సంబంధించిన సమస్త ద్వేషం, అయిష్టత, అవమానంగా చూడడం చూడబడడం అంతరించాలి.

ఎఫెసీ. 2:11, 12లో – దేవునికి నరులు దూరస్థులనే సంగతిని కూడా అంతమొందిస్తుంది. 12వ వచనం అన్యజనులు దేవునికి దూరస్థులైయుండిన అయిదు విధాల వర్ణననిస్తుంది.

1. "ఇశ్రాయేలుతో సహపౌరులు కాక" – అబ్రాహాము సంతతివారికి జన్మవలన చెందిన సహజ పౌరత్వపు హక్కులు అన్యజనులు పొందలేదు.

2. "పరదేశులు, వాగ్దాన నిబంధనలేని పరజనులు" – వారు వెలుపల నిలిచి, లోపలికి చూచేవారు.

3. "నిరీక్షణ లేనివారు" – వారికి క్రీస్తు లేడు గనుక నిరీక్షణ కూడా లేకుండా పోయింది.

4. "లోకమందు దేవుడు లేనివారైయుండి"... దేవుడంటే ఎవరో వారికి తెలియదు. ఆయనతో వారికి నిజమైన సంబంధం ఉండేది కాదు.

5. "క్రీస్తుకు దూరస్థులైయుంటిరి" చరిత్ర యొక్క భావమంతా, ఉద్దేశమంతా

యేసుక్రీస్తునందు స్థాపించబడిందన్న సంగతి అన్యజనులకు తెలియదు.

తన రష్యా రాకపోకలలో, గ్లెన్ ఓవెన్‌కు మనస్సును కరిగించిన అనుభవం కలిగింది. కియివ్ అనే చోట ఒక స్త్రీని కలిసికొన్న సంగతిని చెప్పాడు. తన చేతులతో ఆమె బైబిలును ఎత్తిపట్టి, “నేను లోకము యొక్క నిరీక్షణను నా చేతిలో ఎత్తిపట్టుకున్నాను.” ఆమె చెప్పినదానికి, అతడు తన ప్రతిచర్యను పంచుకొంటూ, యిలా అన్నాడు:

> … గొంతు బిగబట్టి నేను ఆమెవైపు చూచాను. ఆమె స్వరంలో దుఃఖముంది, తన కండ్లలో దుఃఖముంది, తన హృదయంలో దుఃఖముంది. అయితే యింపైన ఆమె అంతరంగంలో నిరీక్షణ ఉంది. కొట్టబడిన ఆమె హృదయంలో దేవునికి తెరిచిన వారియందు ఎల్లప్పుడు రగిలే జ్వాలాగ్ని మండుతుంది. బైబిలును మెల్లగా ముద్దు పెట్టుకుంటూ, తాను పెట్టుకున్న నిరీక్షణకు కారణం తానెరిగినదైయుంది …
>
> తన కథను తన బాధను పంచుకున్నప్పుడు, ఆమె కన్నీళ్లతో మా కన్నీళ్లు జతకూడాయి. చెర్నోబిల్ న్యూక్లియర్ యాక్సిడెంటులో పద్దెనిమిది నెలలకు ముందు తన ఏకైక – పుత్రుడు చనిపోయాడు. వైద్య సహాయం తక్కువై ఆమె భర్త మూడునెలలు క్రిందటే చనిపోయాడు. ఇప్పుడు ఆమె ఆదరణ, నిరీక్షణకొరకు వచ్చింది.
>
> … నెమ్మదిగాను సాధువుగాను ఉండిన యూక్రేన్ దేశపు స్త్రీ, దేవుని కుమారుడైన యేసుక్రీస్తునందు తనకు నిరీక్షణ ఉన్న సంగతి ఎరిగినదైయుంది. ఆమె ప్రభుత్వం ఆమెను చేయి విడిచింది. నిశ్చయమైన అర్థంలో జీవితం ఆమెను నిరాశపరచింది. తాను అధికంగా ప్రేమించిన వారి జీవితాలు గతించిపోయాయి. ఒంటరిది, ఆధారపడడానికి మానవ ఆధారాలేవీ ఆమెకు లేవు. ప్రభువైన యేసునందు నిరీక్షించుటకన్న ఆమెకు మరి యికను ఏ హేతువూ లేదు. మనలో ఎవనికైనా ఆయనయే నిరీక్షణయై ఉన్నాడు.[4]

యేసు లేకుంటే మనకు నిరీక్షణయేలేదు, అయితే ఆయన మన జీవితాలను గిర్రున త్రిప్పాడు. ఆయన వైపుకు మరలిన ఎవనికైనా ఆయన నిరీక్షణ ప్రసాదిస్తాడు. “లాభమేముంది” లేక “ప్రయోజనమేముంది?” అని నీవు ఆశ్చర్యపోతున్నప్పుడు, – జీవితానికి గమ్యమనేదే కానరానప్పుడు ప్రభువైన యేసు వచ్చి సమస్తాన్ని మార్చివేస్తాడు.

13వ వచనంలో పౌలు దీన్ని ఎలా స్థిరపరచుతున్నాడో గమనించు: “అయినను మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తుయేసునందు క్రీస్తు రక్తమువలన సమీపస్థులై యున్నారు.” ఈ లేఖన భాగము ఏమి చెప్పుతుందో ఆలోచించు. ఎందుకంటె, “క్రీస్తు యేసులో” ఉండడమనేది సంపూర్ణమైన వ్యత్యాసాన్ని కలిగిస్తుంది. “క్రీస్తుయేసునందు” నూతన జాతి వర్ణించబడింది. “క్రీస్తు రక్తమువలన” ఈ సమాజపు ప్రజలు ఉనికిలోనికి వచ్చారు.

ప్రభువైన యేసు చేసే వ్యత్యాసం లేకుండ మన జీవితాలు ఏమైయుండేయో! మనకు నిరీక్షణను ప్రసాదించగోరి యేసు చేసిన దానిని మనం ఆలోచించినప్పుడు మనము దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లింప బద్ధులమైయున్నాం. మన గత జీవితాలను జ్ఞాపకం చేసికొనడంవలన నూతన జాతియందు మన అభినందన అధికమౌతుంది.

## నూతన జాతిలో మన పాలుపంపులకు మన ప్రభువుకు రుణపడియున్నాం

నూతన జాతిలో మన పాలుపంపులు సంపూర్ణంగా, పూర్తిగా, ఏ కొదువలేకుండ ప్రభువైన యేసుకు రుణపడియున్నాం. క్రొత్త జాతిని సాధ్యం చేసినవాడు ఆయనే. యేసు దీనిని ఎలా చేశాడు? 15, 16 వచనాలలోని క్రియావాచకాలను పరిశీలించు.

ఆరంభంగా, "విధి రూపకమైన ఆజ్ఞలుగల ధర్మశాస్త్రమును తన శరీరమందు కొట్టివేయుటచేత" ఆయన నూతన జాతిని సాధ్యపరచాడు. యేసు యూదుల మతాన్ని ఎత్తివేశాడు.

దేవుని వద్దకు క్రైస్తవ్యం మాత్రమే మార్గమనే విషయాన్ని క్రీస్తు ప్రభువు తేటపరచాడు. "–నేనే మార్గమును, సత్యమును, జీవమును నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" అని ఆయన తెలియజేశాడు (యోహాను 14:6). "మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెనుగాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" అని పేతురు తెలిపాడు (అపొ. 4:12).

మతం మీద ఆధారపడి వేరుచేయబడడం, విరోధపరచడం శాశ్వతంగా నిలిచిపోవ దానికి ప్రభువైన యేసు మరణించలేదు. మత సంబంధమైన విభజనలను అంతమొందించ డానికి ఆయన చనిపోయాడు.

ప్రభువైన యేసు యింకా ఏమి చేశాడో గమనించు. "ఈ యిద్దరిని తనయందు ఒక్క నూతన పురుషునిగా సృష్టించి ..." అని 15వ వచనం అంటుంది. ఏదో ఒక దానిని ఆయన రద్దు చేయడం మాత్రమేగాక, ఏదో ఒక దానిని ఆయన సృజించాడు కూడా. యేసు సృజింపనుద్దేశించిందేమి? తనయందు ఒక నూతన పురుషుని సృజింప వచ్చాడు. "నూతన" అనే పదం ప్రాముఖ్యమయ్యింది. రెండు గ్రీకు పదాలు "నూతన" లేక "క్రొత్త" అనేవాటిని తర్జుమా చేశాయి. *Neos* అంటే, కాలములో "క్రొత్త" లేక "నూతనం." ఏదైనా ఇటీవలే ఉనికిలోనికి వస్తే, అది క్రొత్తది లేక నూతనమైనది. రెండవ గ్రీకు పదం *kainos*, అంటే – గుణములో క్రొత్తది. సంపూర్ణంగా వేరైనట్టు కన్పించేవరకు మార్పు చెందడం లేక వృద్ధి చేయడం అనే భావంలో క్రొత్తది లేక నూతనమైనది.[5]

15వ వచనంలో "నూతనం" అనే దానికి పౌలు రెండవ పదాన్ని వినియోగించాడు. "నూతన పురుషుని" యింతకు ముందు తెలియబడని – మానవ గుణాన్ని ఉనికిలోనికి తెచ్చే నిమిత్తము – నూతన జాతిని సృజించడానికి యేసు వచ్చినట్లు క్రైస్తవులు తెలిసికోవాలని అతడు కోరాడు.

ప్రభువైన యేసుకు సంబంధించి మూడవ క్రియా వాచక పదాన్ని 16వ వచనం యిస్తుంది. "ఒక్క నూతన పురుషుని" సృజించడంలో ప్రభువైన యేసు మనస్సులో ఉన్న గురి ఏదో అది మనకు తెలుపుతుంది. "తన సిలువవలన ఆ ద్వేషమును సంహరించి, దాని ద్వారా వీరిద్దరిని ఏకశరీరముగా చేసి, దేవునితో సమాధానపరచవలెనని యీలాగు చేసెను."

దీనిని యేసు సిలువ వద్ద చేశాడు. మూడవ జాతిని – నూతన మానవత్వాన్ని – ఒకే శరీరాన్ని – ఆయన దేవునితో సమాధానపరచాడు. ఆయన దేవునీ నరునీ తిరిగి ఏకము చేసెను. యేసు నరులను నరులతో ఏకము చేసెను.

ఒకే గది ఉండే యింటిని అవివాహితులైన యిద్దరు సహోదరీలు పంచుకున్న కథను రాబర్ట్ లూయిస్ స్టీవెన్‌సన్ చెప్పాడు. కాలక్రమంలో, వారు నివసించే ఆ స్థలం బాగా ప్రయాసపడేలా వారిని చేసింది. మతాన్ని గూర్చి ఒక రోజు వారి మధ్య తీవ్రమైన చర్చ జరిగింది. వారు ఎంతగా కోపగించుకొని కలతచెందారంటే, ద్వేషపూరితమైన విమర్శలు ఒకరిమీద ఒకరు కురిపించుకున్నారు. ఆ వివాదం తరువాత ఒకరితో నొకరు మాట్లాడుకోకుండ మానివేశారు.

దినాలు నెలలైపోయాయి. ఒకరితో ఒకరు మాటా పలుకు లేకుండనే కొనసాగారు. మరో యిల్లు తీసికొనడానికి వారిద్దరిలో ఎవరికీ స్తోమత లేకుండాపోయింది. గనుక ఆ ఒకే గదిలో ఒకరితో నొకరు ఎన్నడు పలుక్కోకుండ ఉండిపోయారు. వారి హద్దులను వేరుచేసుకొనడానికి నేలమీద చాక్ గీతలు గీచుకున్నారు. సంవత్సరాల తరబడి ఒకరినొకరు ద్వేషించుకొంటూ, ఒకరితో నొకరు ఎన్నడు ఒక్క మాటైనా లేకుండా కాలం గడిపారు. రాత్రుల్లో, శత్రువులైనవారు ఒకరి శ్వాసను ఒకరు వింటూ నిద్రలోనికి వెళ్లేవారు. మిగిలిన వారి జీవిత కాలమంతా ఆ దుర్భరమైన పరిస్థితిలోనే జీవించారు.

అట్టిది కేవలం సాహిత్యంలోనే కాదు, నిజ జీవితంలో కూడా అది సంభవిస్తుంది. స్థానిక సంఘాల్లో సయితం నేను దాన్ని చూచాను. నేలమీద చాక్ గీతలే గీచుకోనవసరం లేదు, కాని ఆ గీతలు అక్కడ ఉండనే ఉన్నాయి. క్రీస్తు నామాన్ని ధరించుకున్నవారు ఒకరితో నొకరు ఏ సంబంధం లేకుండా ఉంటారు. యితరులకంటే ఆత్మ సంబంధంగా శ్రేష్ఠులం అనే భావాలతో ఉంటారు.

క్రీస్తు శరీరంలో ఎక్కడైనా, విరోధ భావము, లేక విభజన, లేక వేరవ్వడం అనేది ఉన్నప్పుడు, క్రీస్తు దేనికి చనిపోయాడో – దానంతటికి విరోధంగా జీవితాలున్నాయని, దేవుని వాక్య అధికారాన్ని బట్టి చెప్పుతున్నాను. ఒకే ఒక, నూతనమైన, ఏకత్వంగల మానవత్వాన్ని సృజించడానికి – అలా సమాధానపడడానికి – సంధి చేయడానికి ప్రభువైన యేసు అవతరించాడు.

## ముగింపు

క్రీస్తుకు వెలుపల ఉన్న మానవత్వం గందరగోళంతో కూడినదైయుంది. మనం జీవిస్తున్న లోకం వేరు చేయడానికి, విరోధ భావం కలిగించడానికి, పగలు, పంతాలు, పట్టింపులు కలిగియుండడంలో ప్రత్యేకతను వహించినట్టు – ఉదయపు వార్తాపత్రికలు, సాయంత్రపు వార్తాపత్రికలు, కడకు మన వ్యక్తిగత జీవిత అనుభవమే తగినంతగా చూపుతుంది. యేసు లేకుంటే – “ఎవరికి వారే” అనేది ఈ లోకం.

దీనికి తీక్షణమైన వ్యత్యాసంగా, సంఘము సమాధానానికి చోటైయుండాలి. తెగిపోయిన బంధాలను కలిపే దూరమైన మనస్సులను, మనుష్యులను దగ్గరకు చేర్చే –

సమాధానపరచబడే, యితరులను అంగీకరించే, నూతన జాతికి ప్రాతినిధ్యమిచ్చే చోటుగా ఉండాలని ప్రభువు తన సంఘానికి పిలుపునిస్తున్నాడు. సమస్త విరోధాలు, వైషమ్యాలు తొలిగింపబడి, సంఘం సఖ్యంగా ఉండే చోటైయుంది. దానికే ప్రభువు తన ప్రాణం పెట్టాడు.

ఇది సాధ్యం కావాలంటే, కొన్ని విషయాలు మనం బహు తీవ్రంగా ఆలోచింపవలసి ఉంటుంది.

ఈ నూతన జాతి క్రీస్తు ప్రభువుకు ఎంత ప్రాముఖ్యమో మనం గుర్తించి అభినందించేవరకు క్రైస్తవ్యాన్ని మనం ఎన్నడూ అర్థం చేసికోలేం. క్రైస్తవ్యం జీవించేది క్రీస్తు శరీరంలోనే.

వ్యక్తిగత జీవితాల్లోను, స్థానిక సంఘాల్లోను అడ్డుగోడలు నిలిచి ఉండడాన్ని సమస్యగా మనం చూడలేకుంటే, మనం క్రైస్తవ్యాన్ని అర్థం చేసుకోలేం. స్థానిక సంఘం ప్రజలను అంగీకరించాలి, కౌగలించుకోవాలి, ప్రేమించాలి. సంఘములో ఉన్న ఎవరైనా – వెలుపల ఎక్కడ ఎన్నడు కన్పించని అరుదైన ప్రజలుగా అనుభూతి పొందాలి. ప్రతివానికి అందులో చోటున్నదని, క్రీస్తులో ఉన్న ప్రతివాడు ప్రతివానికి చెందినవాడనే భావన కలిగియుండాలి.

---

సూచనలు

[1]Kent Hughes, *Ephesians: The Mystery of the Body of Christ* (Wheaton, Ill.: Crossway Books, 1990), 92-93. [2]Clement of Alexandria, quoted in Hughes, 93. [3]Bob Hendren, *Chosen for Riches: A Life-Related Exposition of Ephesians* (Austin, Tex.: Journey Books, 1978), 49. [4]Glenn Owen, "Undying Spirit of Hope," *Upreach Magazine* (January-March 1994), 3. [5]*Kainos* "నూతన'మైనదాన్ని తెలుపుతుంది – అది అలవాటులేనిది ఉపయోగించనిది, కాలంలో 'క్రొత్తది' కాదు, ఇటీవలది కాదు. కాని రూపానికి లేక గుణానికి 'క్రొత్తది,' పాతది అనేదానితో పోల్చి తారతమ్యం చూస్తే వేరైన స్వభావముగలది." *Neos* "అనేది కాలంలో 'క్రొత్తది,' యిటీవలది; యిది యువకులకు ఉపయోగించబడింది. తర్జుమా చేసినప్పుడు పోలికలో చూపబడి 'చిన్నయైన' అని చెప్పబడింది; ఈ విధంగా, 'క్రొత్తది' అనేది గుణంలోను, స్వభావంలోను పాతదాన్నే ఉత్పత్తి చేయవచ్చు. *Neos* మరియు *kainos* అనేవి కొన్నిసార్లు ఒకేదానికి కూడా వినియోగింపబడ్డాయి, అయితే ముందుగా చూపబడిన వ్యత్యాసం ఉండనే ఉంటుంది. ఈ విధంగా 'నూతన పురుషుడు' అని ఎఫెసీ. 2:15లోని (*kainos*) 'క్రొత్తది' శీలంలో వేరైయుంటుంది. … అయితే కొలస్సీ. 3:10లోని (neos) 'నూతన స్వభావం' విశ్వాసి యొక్క నూతన అనుభవాన్ని, ఇటీవల ప్రారంభింపబడి యింకను ముందుకు సాగుతున్న దానిని నొక్కి చెప్పుతుంది." W. E. Vine, Merrill F. Unger, and William White, "new," *Vine's Expository Dictionary of Biblical Words* (Nashville, Tenn.: Thomas Nelson Publishers, 1985), 430-31.